www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 3 డిసెంబర్ 2024



రమేష్‌బాబుకు 'గురుబ్రహ్మ' అవార్డు

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

ధవళేశ్వరం జూనియర కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ కొండ్రు రమేష్‌బాబు గురుబ్రహ్మ రాష్ట్ర అవార్డు దక్కింది. 28 ఏళ్లుగా ఆయన ఇంటర్మీడియన్ విద్యలో సేవలందిస్తున్నారు. విద్యార్థులకు చదువుతోపాటు వారిలోని సృజనాత్మకతను వెలికితీసేందుకు పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. వివిధ పోటీ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నారు. ఆయన సేవలకు 2024కు సంబంధించి రాష్ట్ర ఉత్తమ పురస్కారం అందింది. ఈ అవార్డును ఆయన సోమవారం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆన్లైన్లో ద్వారా అందించారు. ఈ అవార్డును అందుకున్న సందర్భంగా కళాశాల విద్యార్థినీ, విద్యార్థులు మరియు కళాశాల సిబ్బంది పలు విద్యాశాఖ అధికారులు కొండ్రు. రమేష్ బాబుకు అభినందనలు తెలియజేశారు.

రేషన్ కార్డుల కోసం ఎదురుచూపులు

అందుబాటులోకి రాని అప్‌లోడ్ సైట్
రేషన్ కార్డు అర్హతకు కొత్త నిబంధనలు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

కొత్త రేషన్ కార్డుల కోసం అర్హులు ఎదురు చూస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు మంజూరు చేస్తామని ప్రకటించిన విషయం విధితమే. ఈ మేరకు ఉన్నతాధికారులతో ఇటీవల టెలికాన్ఫరెన్స్ నిర్వహించి విధి విధానాలు సైతం తెలియజేశారు. ఈ నెల 2వ తేదీన ప్రారంభించి 28వ తేదీ నాటికి పూర్తి చేయటంతో పాటు సంక్రాంతి పండగ నుంచి కొత్త రేషన్ కార్డులు జారీ చేయాలని ప్రభుత్వం యోచించింది. అయితే దరఖాస్తులు అప్‌లోడ్ చేసే సైట్ అందుబాటులోకి రాకపోవటంతో అప్‌లోడ్ ప్రక్రియ ఇంకా ప్రారంభం కాలేదు. గతంలో రేషన్ కార్డుల దరఖాస్తుల స్వీకరణ, అర్హుల ఎంపిక ప్రక్రియ నిరంతరం జరిగేది. అయితే వైసిపి ప్రభుత్వం సంవత్సరంలో రెండు సార్లు మాత్రమే కార్డులు పంపిణీ ప్రక్రియ నిర్వహించింది. ఈ పరిస్థితిని ఎత్తిచూపుతూనే కూటమి పార్టీలు ఎన్నికల ముందు కూటమి నాయకులు వాగ్దానాలు చేశారు. అధికారంలోకి వచ్చి 5 నెలలు గడిచినా రేషన్ కార్డులు మంజూరుపై తాత్సారం జరుగుతోంది. ఇప్పటి వరకు రెండు రకాల ఆదాయ పరిమితులు బట్టి రేషన్ కార్డులు మంజూరు చేశారు. కొత్త రేషన్ కార్డులు ఇవ్వనున్న నేపథ్యంలో ఆదాయ పరిమితిని మార్చాలా.. తగ్గించాలా పాత విధానాన్నే కొనసాగించాలా అనే విషయమై ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. దీనిపై పౌరసరఫరాల శాఖ విధి విధానాలు అధ్యయనం చేస్తోంది. రేషన్ కార్డులు పౌరసరఫరాల శాఖ సరఫరా చేసే వస్తువులను తీసుకోవడానికే కాకుండా పలు సంక్షేమ పథకాల్లోనూ ఉపయోగిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆదాయ పరిమితి నిర్ధారణ విషయంలో కొత్త రేషన్, హెల్త్ కార్డుల జారీపై ప్రభుత్వం పలు మార్పులను చేయాలని యోచిస్తోంది. ప్రస్తుతం గ్రామీణ అర్బన్ ఏరియాల వారీగా వార్షికాదాయ పరిమితి ఆధారంగానే తెల్ల రేషన్ కార్డును ప్రభుత్వం జారీ చేస్తోంది. గ్రామీణ ప్రాంతంలో రూ.1.50 లక్షలు అర్బన్ రూ.2లక్షలల్లోపు వార్షిక ఆదాయాన్ని కార్డుల జారీకి ప్రాతిపదికగా తీసుకుంటున్నారు. భూ విస్తీర్ణం మాగాని భూమి అయితే 3.5 ఎకరాలు మెట్టభూమి అయితే 7.5 ఎకరాల్లోపు ఉండాలనే నిబంధనలు అమలు చేయడంతో పాటు పట్టణాల్లో భూమితో సంబంధం లేకుండా వార్షికాదాయాన్ని మాత్రమే పరిగణలోకి తీసుకోవాలని నిర్ణయించింది. కొత్త రేషన్ కార్డులు మాత్రమే కాదు ప్రస్తుతం ఉన్న రేషన్ కార్డుల స్థానంలో కొత్తగా పంపిణీ చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. కొత్త రేషన్ కార్డుల డిజైన్లను ఎంపిక చేసి ముద్రించి పంపిణీ చేయనున్నారు.

ప్రస్తుతం ప్రజల దగ్గర ఉన్న కార్డులను పూర్తిగా మార్చనున్నారు. క్యూఆర్ కోడ్‌తో పాటు కుటుంబ సభ్యుల చిత్రాలతో వీటిని ముద్రిస్తారు. రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పులు, కొత్తగా పెళ్లయిన వారికి కార్డులు జారీ చేయనున్నారు. ఇప్పటికే వారి కుటుంబానికి ఉన్న రేషన్ కార్డుల నుంచి పేర్లు తొలగించేందుకు సైట్ ఆప్షన్లు కల్పించారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు వివాహ రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ ఆధారంగా కొత్త జంటకు రేషన్ కార్డు జారీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అదే విధంగా వినియోగంలో లేని కార్డులను తొలగించి కొత్త కార్డులు జారీ చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తుంది. కొందరు కార్డులు దారులు ఆరు నెలలుగా రేషన్ సరుకులు తీసుకోవడం లేదని అధికారులు గుర్తించారు. ఈ కార్డులు తొలగిస్తే ప్రభుత్వానికి ఆదా అవుతుందని ప్రభుత్వం భావిస్తోంది. అయితే ప్రభుత్వం వద్ద కొత్త రేషన్ కార్డు దరఖాస్తులు సహా మార్పులుచేర్పులు కోసం ఇప్పటికే దరఖాస్తులు ఉన్నాయి. కొత్త రేషన్ కార్డులు, స్ప్లిట్, కొత్త సభ్యుల యాడింగ్, తొలగింపు, అడ్రస్ మార్పులు, సరెండర్ ఇలా పలు రకాల మార్పులతో భారీగా దరఖాస్తులు వస్తాయని వీటిని నిర్దిష్ట సమయంలోగా పూర్తి చేసేందుకు కసరత్తు జరుగుతోంది.



అధికారికంగా ఉత్తర్వులు రావాల్సి ఉంది

రేషన్ కార్డుల కోసం దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ యథావిధిగా జరుగుతోంది. ఉన్నతాధికారులు ఇటీవల నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో కొత్త రేషన్ కార్డుల గురించి తెలియజేశారు. త్వరలోనే సైట్ ప్రారంభం కానుంది. ఆ వివరాల ప్రకారం దరఖాస్తు దారులు సచివాలయాల్లోనే దరఖాస్తులు చేసుకోవాలి. రేషన్ కార్డుల ప్రక్రియ విధి విధానాలపై అధికారికంగా ఉత్తర్వులు రావాల్సి ఉంది.

- ప్రసాదరావు, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

126 అర్జీల స్వీకరణ : కలెక్టర్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పిజిఆర్ఎస్)లో 126 అర్జీలను స్వీకరించామని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిజిఆర్ఎస్‌కు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తుందన్నారు. వారంవారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దీనిపై సమీక్షిస్తున్నారన్నారు. జిల్లాలో లా అండ్ ఆర్డర్, పంచాయితీ రాజ్ శాఖలకు సంబంధించి ఎక్కువగా అర్జీలు వచ్చాయన్నారు. అర్జీదారుల సమస్యలకు నాణ్యతతో కూడిన విధంగా శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. ఎట్టి పరిస్థితిల్లో అర్జీలు పెండింగ్ ఉండరాదని, రీ ఓపెన్ కారాదని స్పష్టం చేశారు.

డిసెంబర్ 5న ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకు సంబంధించి ఉపాధ్యాయుల ఎంఎల్‌సి పోలింగ్ ప్రక్రియకు అన్ని మండల కేంద్రాల్లో పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. అదే రోజు జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో నిర్వహించే నీటి వినియోగదారుల సంఘం ఎన్నికల్లో విధులు నిర్వహించే అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. సజావుగా ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించాలన్నారు. ఈ ఎన్నికల పోలింగ్ ప్రక్రియకు సంబంధించి కలెక్టరేట్‌లో ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు.

జిల్లాలో ఎంఎస్ఎంఇ, స్కిల్ డెవలప్‌మెంట్, పశు గణన, పిఎంఇవై 2.0 లబ్ధిదారులు గుర్తింపు వంటి సర్వేలు నిర్వహిస్తున్నామని,మండల స్థాయి అధికారులు అందరూ అందుబాటులో ఉండి కార్యక్రమాలను నిర్వహించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రంలో జెసి ఎస్.చిన్నరాముడు, డిఆర్ఒ టి.సీతారామమూర్తి, సిపిఒ ఎల్.అప్పల కొండ, జిల్లా సహకార అధికారి శ్రీరాములునాయుడు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎస్.మాధవరావు, జిల్లా మత్స్యశాఖ అధికారి వి.కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి

ప్రజాశక్తి - చాగల్లు

తేమ శాతంతో సంబంధం లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతు సంఘం జిల్లా కన్వీనర్ గారపాటి వెంకటసుబ్బారావు తహశీల్దార్‌కు సోమవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుపాను ప్రభావంతో రైతులు నష్టపోకుండా ధాన్యం సేకరణ చేపట్టాలన్నారు. కళ్లాల వద్దే ధాన్యం కొనుగోలు చేసి నేరుగా రైతు సేవా కేంద్రాల ద్వారా మిల్లుల వద్దకు తరలించేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. తేమశాతం 25 ఉన్నప్పటికీ ధాన్యం కొంటామనిమంత్రి నాదెండ్ల మనోహర్ మాటలు ప్రకటనకే పరిమితం అవుతున్నాయి. తుపాను ప్రభావంతో రైతులు ధాన్యాన్ని ఆరబెట్టే అవకాశం లేక అమ్మేందుకు సిద్ధపడితే తేమ శాతం వల్ల సిబ్బంది ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. మినప పంట వేరుశనగ పంటలు కోసి పొలంలోనే ఉన్నాయన్నారు. కావున ప్రభుత్వమే రైతు సేవా కేంద్రం ద్వారా కొనుగోలు చేయాలని, గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు.



వినతిపత్రం ఇస్తున్న రైతు సంఘం నాయకులు

ప్రతీ సోమవారం కలెక్టరేట్‌లో ఆధార్ సేవలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

ప్రజల సౌకర్యార్థం ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో ఆధార్ కేంద్రాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా అభివద్ధి అధికారి పి.వీణాదేవి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆధార్ కేంద్రాన్ని ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా 102 సచివాలయాల్లో ఆధార్ కిట్స్ అందుబాటులో ఉన్నాయని తెలిపారు. సాంకేతిక పరమైన ఇబ్బందులూ లేకుండా ఎప్పటికప్పుడు సాంకేతిక నిపుణులు జిల్లా కేంద్రంలో అందుబాటులో ఉంచి సమస్యలను పరిష్కారం చేస్తున్నట్లు వీణా దేవి తెలిపారు. ఆధార్ సేవలని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే పిజిఆర్ఎస్ కార్యక్రమంలో పాల్గొనేందుకు జిల్లా నలుమూలల నుంచి వస్తుంటారని వారి సౌకర్యార్థం ఈ సెంటర్‌ను ఏర్పాటు చేశామన్నారు.

బాలికలను వేధిస్తున్న టీచర్‌పై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

బొమ్మూరు ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలికల పాఠశాలలో బాలికలను లైంగికంగా వేధిస్తున్న ఉపాధ్యాయునిపై చర్యలు తీసుకోవాలని పౌర హక్కుల సంఘం డిమాండ్ చేసింది. ఈ ఆరోపణలపై నిజనిర్ధారణ కమిటీ విద్యార్థులను, తల్లి దండ్రులను, ఉపాధ్యాయులను విచారణ చేసింది. బాలికలను ఉపాధ్యాయుడు లైంగికంగా వేధించటం, అత్యాచార ప్రయత్నం చేయడం నిజమేనని పౌర హక్కుల సంఘం విచారణలో తేలిందని రాష్ట్ర అధ్యక్షులు వేడంగి చిట్టిబాబు, ఉపాధ్యక్షులు ఎన్.శ్రీమన్నారాయణ తెలిపారు. దీనిపై అధికారులు చేసిన విచారణ రిపోర్టును పోలీసులకు పంపించి కేసు పెట్టి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

పిడిఎస్‌యు ఆధ్వర్యంలో ధర్నా

విద్యార్థులను లైంగికంగా వేధించిన టీచర్‌ని తక్షణం అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని పిడిఎస్‌యు డిమాండ్ చేశారు. ఈ మేరకు పాఠశాల వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా వెంకటనాయుడు, మహిళా సంఘం నాయకురాలు మల్లిక మాట్లాడారు. టీచర్‌ను తొలగించాలని బాలికలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. వెంటనే ఉపాధ్యాయునిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. బాలికలకు తగిన రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. బాలికల పాఠశాలలో పురుష ఉపాధ్యాయులను నియమించరాదన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

న్యూట్రి గార్డెన్స్‌కు పల్ల వెంకన్న ట్రస్ట్ మొక్కల వితరణ

ప్రజాశక్తి-కడియం

తూర్పుగోదావరి జిల్లా పాఠశాలల్లో పెంచుతున్న న్యూట్రి గార్డెన్స్‌కు కడియంలోని పల్ల వెంకన్న ట్రస్ట్ తరపున రూ.లక్ష విలువైన 2వేల మునగ మొక్కలను వితరణ చేసినట్లు డిఇఒ కె.వాసుదేవరావు తెలిపారు. కలెక్టర్ ప్రశాంతి సూచనల మేరకు అత్యంత పోషక విలువలు ఉన్న మునగ మొక్కలను పాఠశాలల్లో పెంచాలనే ఉద్దేశ్యంతో తమ ట్రస్ట్ ద్వారా 19 మండలాలకు 2వేల మొక్కలను అందించామని ట్రస్ట్ సభ్యులు, పల్ల వెంకన్న కుమారులు సత్తిబాబు తెలిపారు. ఇవి సరికొత్త హైబ్రిడ్ రకం మొక్కలని, నేల స్వభావాన్ని బట్టి నాటిన ఆరు నెలల్లోనే ఫల సాయన్నిస్తాయన్నారు. చెట్టు మొత్తం కాయలే ఉంటాయన్నారు. తమ తండ్రి వెంకన్న గతంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని చాలా పాఠశాలలకు బడితోట పేరుతో లక్ష మొక్కలు వితరణ చేశారని గుర్తు చేశారు. ఆయన అడుగుజాడల్లో తాము కూడా తమవంతు సేవ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పల వెంకన్న చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు పల్ల సత్తిబాబు, పల్ల సుబ్రమణ్యం, పల్ల గణపతి తదితరులు పాల్గొన్నారు.



మొక్కలను అందిస్తున్న పల్లవెంకన్న ట్రస్ట్ ప్రతినిధులు

అవగాహనతోనే విద్యుత్ ప్రమాదాల నివారణ

ప్రజాశక్తి - కడియం

పూర్తి స్థాయి అవగాహనతోనే విద్యుత్ ప్రమాదాలు జరగకుండా నివారించొచ్చని, విద్యుత్ పట్ల నిర్లక్ష్యంగా ఉండ కూడదని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ దాట్ల శ్రీధర్‌వర్మ అన్నారు. కడియం విద్యుత్ శాఖ సెక్షన్ కార్యాలయం వద్ద సోమవారం విద్యుత్ ప్రమాదాల నివారణపై అవగాహన, ప్రతిజ్ఞ విద్యుత్ శాఖ ఎడిఇ సన్యాసిరావుతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ ప్రమాదాలను నివారించేందుకు ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. ముఖ్యంగా నర్సరీ రైతులు లారీలపై మొక్కలు ఎగుమతి చేసే సమయంలో పొడవైన మొక్కలు విద్యుత్ తీగలకు తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యుత్ లైన్ వెంబడి ఎత్తైన మొక్కల పెంపకం జరుపరాదన్నారు. దీనికి సహకరించాలనికోరారు. వరి పంట పొలాల్లో ఎలుకలు నివారించేందుకు విద్యుత్ తీగలను ఏర్పాటు చేయరాదన్నారు. ఇది చట్టరీత్యా నేరమన్నారు. అలాంటి తీగలవల్లే ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈలు రామారెడ్డి, వి శ్రీనివాసు, ఎల్ఐలు, లైన్‌మెన్‌లు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేయిస్తున్న విద్యుత్ శాఖ అధికారులు

విద్యుత్ ఛార్జీల పెంపు తగదు

ప్రజాశక్తి- కడియం

ప్రజలపై ఆర్థిక భారం మోపుతూ కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జీలను వెంటనే తగ్గించాలని కాంగ్రెస్ పార్టీ రాజమహేంద్రవరం రూరల్ ఇన్‌ఛార్జి తాడాల కొండ్రాజు డిమాండ్ చేశారు. మండలంలోని బుర్రిలంక పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడారు. ఎట్టి పరిస్థితుల్లోనూ విద్యుత్ ఛార్జీలు పెంచే ప్రసక్తే లేదనిఎన్నికల సమయంలో చంద్రబాబు పదేపదే చెప్పేవారని గుర్తు చేశారు. ఎన్నికల్లో గెలిచిన తరువాత ఆ మాట మరచి ప్రజలపై విద్యుత్ ఛార్జీల భారం మోతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక అన్ని ధరలూ ఆకాశాన్నంటుతున్నాయన్నారు. దీనికి తోడు విద్యుత్ భారాలు మోపడం తగదన్నారు. ధరలు తగ్గే విధంగా చర్యలు తీసుకోవాలని, విద్యుత్ ఛార్జీల పెంపును ఉపసంహరించుకోవాలన్నారు. లేకుంటే కాంగ్రెస్ పార్టీ తరుపున ఉద్యమిస్తామన్నారు.

హెచ్ఎంలకు మొక్కల పంపిణీ

ప్రజాశక్తి - తాళ్లపూడి

మెగా పేరెంట్స్ మీటింగ్ రోజున విద్యార్థుల తల్లిదండ్రులతో పాఠశాల ఆవరణలో మొక్కలు నాటించి వాటి సంరక్షణ విద్యార్థులతో చేయించాలని మండల విద్యాశాఖ అధికారులు సిహెచ్ బాలామణి, నెహ్రూజీ సూచించారు. మండలంలోని వేగేశ్వరపురం ఉన్నత పాఠశాలలో సోమవారం జరిగిన ఒక కార్యక్రమంలో వివిధ పాఠశాలల్లో చెందిన హెచ్ఎంలకు సుమారు 100 మొక్కలను ఎంఇఒ అదించారు. విద్యార్థుల పూర్తి సమాచారాన్ని తెలియజేసే విధంగా రూపొందించిన సమగ్ర ప్రగతి పత్రాలు కూడా ఉపాధ్యాయులకు అందించారు. మెగా పేరెంట్స్ మీట్‌కు ముందుగా వీటిని పూర్తి చేసి విద్యార్థులకు అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అన్ని పాఠశాలలకు చెందిన హెచ్ఎంలు పాల్గొన్నారు

కల్వర్టు పనులు ప్రారంభం
ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - గోపాలపురం

డ్రెయినేజీ నీరు సక్రమంగా పారేలా కల్వర్టు నిర్మాణ పనులను పంచాయతీ సిబ్బంది చేపట్టారు. రోడ్లపైకి డ్రెయినేజీ నీరు చేరడంతో అవస్థలపై సోమవారం ప్రజాశక్తిలో ప్రచురితమైన వార్తలకు అధికారులు వెంటనే స్పందించారు. వెంటనే కల్వర్టు నిర్మాణం నిర్మాణం చేపట్టేందుకు పనులు ప్రారంభించారు. దీంతో స్థానికులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.



నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - చాగల్లు

చాగల్లు మండలంలో 3వ తేదీ నుంచి ఈనెల 8వ తేదీ వరకూ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ చంద్రవరం గ్రామానికి విద్యుత్ సరఫరా నిలిపేస్తుఆన్నమని విద్యుత్ శాఖ అధికారి ఎస్.త్రిమూర్తులు తెలిపారు. ఆర్‌డిఎస్ఎస్ వర్క్స్, కొత్త లైన్ వేసే నిమిత్తం ఈ చర్యలు తీసుకుంటున్నామన్నారు. దీనికి వినియోగదారులు సహకరించాలని కోరారు. 11 కెవి గౌరుపల్లి ఫీడర్ 3-పిహెచ్ సప్లయ్ ఉదయం 5 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల ఇస్తామన్నారు.

మానవతా సంస్థ ఆర్థిక సాయం

ప్రజాశక్తి - చాగల్లు

అనారోగ్యంతో బాధపడుతూ, ఇటీవలే ఆపరేషన్ చేయించుకుని ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న సూతపల్లి వరలక్ష్మికి మానవత సంస్థ రూ.10వేల ఆర్థిక సాయం చేసింది. ఈ కార్యక్రమంలో ఛైర్మన్ ప్రసాద్, చాగల్లు-నేలటూరు లయన్స్ క్లబ్ అధ్యక్షులు, మానవత డైరెక్టర్ ఆళ్ల వీర వెంకటసత్యనారాయణ, కన్వీనర్ ఆలపాటి లక్ష్మణరావు, డైరెక్టర్ బొడ్డు రాజు తదితరులు పాల్గొన్నారు.

షష్టి ఉత్సవాల ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి - బిక్కవోలు

బిక్కవోలు కుమార సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్టి ఏర్పాట్లను రాజమండ్రి ఈస్ట్ జోన్ డిఎస్‌పి భవ్య కిషోర్. సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె ఉత్సవ కమిటీ ఛైర్మన్ పల్లె శ్రీనివాసురెడ్డిని ఏర్పాట్లపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉత్సవ కమిటీ సభ్యులకు, పోలీసు సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం బాణసంచా కాల్పులు నిర్వహించే ప్రాంతం తదితర ప్రాంతాలను పరిశీలించారు. ఆమె వెంట అనపర్తి సిఐ సుమంత్, ఎస్ఐ రవిచంద్ర, సిబ్బంది ఉన్నారు.

ఉపాధి కల్పించాలని మంత్రికి వినతి

ప్రజాశక్తి - పెరవలి


తమకు ఉపాధి కల్పించాలని ఉసులుమర్రుకు చెందిన ఇసుక కార్మికులు సోమవారం మంత్రి దుర్గేష్‌కు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ ఇసుక ర్యాంపు నిర్వహణ ఆగిపోవడంతో ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు మిగిలి ప్రాంతాల్లో ప్రభుత్వ ఇస్తున్న ఉచిత ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయన్నారు. తీపర్రు-2'3 రీచ్‌లో గోదావరి నీరు రావడంతో తవ్వకాలు నిలుపుదల చేశారన్నారు. దీంతో ఇసుక తవ్వే కార్మికులకు ఉపాధి కరువైందన్నారు. గ్రామంలో 800 కుటుంబాలు దీనిపై ఆధారపడి జీవిస్తున్నామరు. ర్యాంపు తవ్వకాలు నీరు లేని వేరే ప్రాంతానికి తరలించి ఉపాధి కల్పించాలని వారు కోరారు

రెడ్ రిబ్బన్ క్లబ్‌కు ప్రథమ బహుమతి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

స్థానిక ఆర్ట్స్ కళాశాలలో నెలకొల్పిన రెడ్‌రిబ్బన్ క్లబర్‌కు రాష్ట్ర స్థాయిలో ప్రథమ బహుమతి వచ్చింది. సోమవారం కళాశాలలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ప్రిన్సిపల్ రామచంద్ర ఈ వివరాలను వెల్లడించారు. కళాశాలకు రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో చేసిన కృషికి ఈ బహుమతి వచ్చిందన్నారు. ఎయిడ్స్, హెచ్ఐవి పై ఈ క్లబ్ అవగాహనా కార్యక్రమాలను నిర్వహించింది. యువతను, ప్రజలను చైతన్య పరిచిందనిత ఎలిపారు. రెడ్ రిబ్బన్ క్లబ్ కో-ఆర్డినేటర్ జి.రవితేజ మాట్లాడుతూ విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం - 2024 సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈ బహుమతి అందుకున్నామన్నారు.

కార్టూ'నిజం'



సైబర్ నేరాలపై అవగాహన

ప్రజాశక్తి- గోపాలపురం

సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని దేవరపల్లి సిఐ బి.నాగేశ్వర్‌నాయక్, ఎస్ఐ కె.సతీష్‌కుమార్ తెలిపారు. సోమవారం మండలంలోని వాదాలగుంటలో సిఐ నాగేశ్వర్‌నాయక్, ఎస్ఐ సతీష్‌కుమార్, సిబ్బంది సైబర్ నేరాలు, చోరీలు తదితరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. గుర్తు తెలియని వ్యక్తులకు వ్యక్తిగత సమాచారాన్ని తెలుపరాదన్నారు. ఆధార్ నెంబర్లు, బ్యాంక్ అకౌంట్ నెంబర్లు, పిన్ నెంబర్, ఒటిపిల సమాచారాన్ని గుర్తు తెలియని వ్యక్తులకు ఇవ్వరాదన్నారు. ఎవరైనా ఇళ్లకు తాళాలు వేసి దూర ప్రాంతాలకు వెళ్లేటప్పుడు పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. అక్రమ మద్యం, నాటు సారా తయారు చేసినా, అమ్మకాలు నిర్వహించినా చట్ట పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. యువత చెడు వ్యసనాలకు, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. బెట్టింగులు, ఆన్‌లైన్ లాటరీలు ద్వారా డబ్బులు పోగొట్టుకోవద్దని హెచ్చరించారు. గుర్తుతెలియని వ్యక్తులు గ్రామాల్లో సంచరిస్తే సమాచారం ఇవ్వాలన్నారు.



రోడ్డుపై వేసిన రాళ్ల గుట్టలతో ఇబ్బందులు పడుతున్న విద్యార్థి

రాళ్ల గుట్టలతో అవస్థలు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

అసలే ఇరుకు రోడ్డు.. అదే రోడ్డును తవ్వేసి ఇరువైపులా పోసిన నల్ల కంకర గుట్టలతో ప్రయాణికులు నానా అవస్థలు పడాల్సి వస్తుంది. చివటం గ్రామంలో బిటి రోడ్డుగా ఉన్న ప్రధాన రహదారిని 18 అడుగులకు పెంచి, సిసి రోడ్డు నిర్మాణాన్ని చేపట్టారు. నల్ల కంకరను సైతం డంప్ చేశారు. అయితే వారం గడిచినా పనులు మాత్రం ప్రారంభం కాలేదు. దీంతో ఉన్న రోడ్డుపై కంకర గుట్టలను వేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇదే రోడ్డుపై ప్రతిరోజూ విద్యార్థులు రాకపోకలు సాగిస్తుంటారు. రాళ్ల గుట్టల నేపథ్యంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని సార్లు గుట్టలపై పడి గాయాలపాలవుతున్నారు.

నాణ్యత లేని సరుకుల అమ్మకం

ప్రజాశక్తి- కడియం

వినియోగదారులకు నాణ్యమైన వస్తువులు అమ్మాలని ప్రభుత్వం హెచ్చరిస్తున్నా డబ్బుకు కక్కుర్తిపడి నాణ్యతలేని ఆహార పదార్థాలు, పురుగులు పట్టిన కిరాణా వస్తువులను అధిక ధరలకు విక్రయిస్తూ జేబులు నింపుకుంటున్నా యజమానులు. మండల కేంద్రమైన కడియంలో ఈ ప్రఖ్యాత సంస్థ ఏర్పాటు చేసిన బజార్ ఈకోవకే వస్తుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం బూజుపట్టిన ఆహార పదార్థాలు బజార్‌లో కనిపించడం పరిపాటిగా మారిందన్నారు. సోమవారం ఎప్పటిలాగే ఒక వినియోగదారుడు గోధుమ రవ్వను ఖరీదు చేసి తీసుకెళ్లాడు. ఇంటికి వెళ్లి చూడగా దాంట్లో పురుగులు ఉన్నాయి. వెంటనే వెనక్కి వచ్చి షాపు నిర్వాహకులను నిలదీయగా నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారు. మరొకటి ఇస్తాం తప్ప ఏమీ చేయలేమంటూ బదులిచ్చి చేతులు దులిపేసుకున్నారు. ఇదే అనుభవం పలువురికి జరిగినట్టు తెలిసింది. ఇప్పటికైనా అధికారులు ఇటువంటి షాపులపై దృష్టి పెట్టి నాణ్యతలేని వస్తువులను అమ్ముతున్న వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నేరాలు ఘోరాలు

గాయపడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి - మామిడికుదురు

ఆటో ఢీకొని గాయపడి చికిత్స పొందుతున్న వ్యక్తి పరిస్థితి విషమించి మృతి చెందినట్లు హెడ్ కానిస్టేబుల్ కెవివిఎస్‌వి.ప్రసాద్ తెలిపారు. రాజోలు మండలం కడలిలోని వాసంశెట్టివారిపాలెనికి చెందిన మాదాసి శివకృష్ణ (35) గత నెల 28న బైక్ పై వెళ్తుండగా గెద్దాడ వద్ద ఒక ఆటో ఢీకొంది. తీవ్రంగా గాయపడిన శివకృష్ణ కాకినాడ జిజిహెచ్‌లో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. ఆయన తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరు సారా విక్రేతల అరెస్ట్

ప్రజాశక్తి - ఆలమూరు

మండపేట మండలంలో నిర్వహించిన దాడుల్లో 75 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సిఐ బిడి నాగేశ్వరరావు తెలిపారు. మండపేట మండలం కేశవరానికి చెందిన కడగాలి రాంబాబు, ఏడిద సావరానికి చెందిన కండ్రేగుల సూరిబాబును అరెస్టు చేసినట్లు సిఐ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

సిగరెట్ కోసం హత్య..?

ప్రజాశక్తి - మండపేట

ఒ సిగరెట్ ఏకంగా ఓ వ్యక్తి ప్రాణం పోవడానికి కారణమైంది. సిగరెట్ కారణంగా ఇద్దరి మధ్య తలెత్తిన చిరు వివాదం చివరకు హత్య కేసుగా మారింది. ఈ ఘటన మండపేట 7వ వార్డు డాక్టర్ బిఆర్ అంబేద్కర్, జగ్జీవన్‌రామ్ స్మారక మందిరం వద్ద చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు. మండపేటకు చెందిన సిందిరావు వీరబాబు భవన నిర్మాణ కార్మికునిగా పనిచేస్తున్నాడు. వివాదాల నేపథ్యంలో భార్య పిల్లలకు కొంతకాలంగా దూరంగా ఉంటున్నాడు. పనిలేనప్పుడు 7వ వార్డులోని అంబేద్కర్ స్మారక మందిరం వద్ద పడుకుంటున్నాడు. ఎప్పటిలాగే ఆదివారం పనిచేసి అర్ధరాత్రి స్మారక మందిరం వద్దకు వచ్చి పడుకున్నాడు. నిద్రిస్తుండగా వేమగిరి సురేష్ మద్యం మత్తులో అతని వద్దకు వచ్చాడు. వీరబాబును లేపి సిగరెట్ ఇవ్వాలని అడిగాడు. ఇవ్వక పోవడంతో అరుగుపై పడుకున్న వీరబాబును కిందికి లాగేశాడు. దీంతో వీరబాబు తలకు తీవ్రగాయమైంది. స్థానికులు గమనించి వీరబాబును మండపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో వీరబాబు(36) సోమవారం తెల్లవారు జామున మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మండపేట టౌన్ ఎస్ఐ హరికోటి శాస్త్రి కేసు నమోదు చేశారు. డిఎస్‌పి ఆధ్వర్యంలో సిఐ పి.దొరరాజు దర్యాప్తు చేస్తున్నారు. దర్యాప్తు అనంతరం వివరాలు వెల్లడిస్తామని సిఐ తెలిపారు.

నిందితుని ఇంటికి వెళ్లిన పోలీసు జాగిలం

కేసు దర్యాప్తులో భాగంగా క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ బందాలు ఘటనా స్థలికి చేరుకుని ఆధారాలు సేకరించాయి. పోలీస్ జాగిలంతో ఘటనా స్థలి చేరుకోగా అది నేరుగా అక్కడి నుంచి పోలీసు స్టేషన్ పక్కనే వున్న సురేష్ ఇంటికి వెళ్లింది. మండపేట 02 మతదు వీరబాబు... ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న క్లూస్ టీం

చెరువులో పడి వృద్ధుడు మృతి

ప్రజాశక్తి - గండేపల్లి

మండలం మల్లేపల్లి గ్రామానికి చెందిన ధర్మయ్య(80) రాజానగరం మండలం తూర్పు గోనగూడెం ఊర చెరువులో పడి మృతి చెందాడు. జీవితంపై విరక్తి చెందిన ధర్మయ్య ఆదివారం ఉదయం ఇంటి నుంచి బయటకు వచ్చాడు. అతని కోసం గాలించినా కన్పించకపోవడంతో కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ శివనాగు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అయితే సోమవారం ఆ వృద్ధుడు తూర్పు గోనగూడెం ఊర చెరువులో మృతి చెందివున్నట్లు పోలీసులు గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఆత్మహత్య కేసులో నిందితుల అరెస్ట్

ప్రజాశక్తి - గొల్లప్రోలు

ఇటీవల దుర్గాడ రైల్వే ట్రాక్ సమీపంలో ఆత్మహత్యకు పాల్పడిన తోగరు దివ్య కేసులో నిందుతులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ పి.రామకృష్ణ తెలిపారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పిల్లలు పుట్టలేదని, అదనపు కట్నం కావాలని వేధింపులకు గురి చేయడంతో ఆమె ఆత్మహత్యకు పాల్పడిందని మృతురాలి తల్లి వరుపుల సీతామహాలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేసినట్లు తెలిపారు. ఈ కేసులో మృతురాలి భర్త తోగరు రమేష్, అత్త మామలు గొల్ల అబ్బాయి, సత్యవతి, కూతురు గుర్రం వినీలను అరెస్టు చేసినట్లు తెలిపారు.



బెల్లపు ఊటను ధ్వంసం చేస్తున్న అధికారులు

800 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని జె.తిమ్మాపురం గ్రామంలో సోమవారం నిర్వహించిన దాడుల్లో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 800 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సిఐ కెవివిడి.అర్జున్‌రావు తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ పి.చిట్టిబాబు పాల్గొన్నారు.

వీరేశ్వర స్వామికి రూ.50.43 లక్షల ఆదాయం

ప్రజాశక్తి -ఐ.పోలవరం

మురమళ్ల గ్రామ పంచాయితీ పరిధిలోని మురమళ్ల శ్రీ వీరేశ్వరస్వామి ఆలయానికి ఈ ఏడాది కార్తీక మాసంలో గణనీయంగా ఆదాయం పెరిగిందని ఆలయ కార్యనిర్వాహణ అధికారి మాచిరాజు లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గత రెండేళ్ల కంటే ఈ ఏడాది ఆలయ ఆదాయం రూ.6,48,816 పెరిగిందన్నారు. ఆలయానికి వివిధ సేవల ద్వారా రూ.50,43,680 ఆదాయం వచ్చిందన్నారు.

నిత్యాన్నదాన ట్రస్ట్‌కు దాతల విరాళాలు

ప్రజాశక్తి -మామిడికుదురు

అప్పనపల్లి శ్రీ బాల బాలాజీ శాశ్వత నిత్యాన్నదాన ప్రసాద ట్రస్ట్‌కు సోమవారం పలువురు దాతలు విరాళాలు అందించారని ఆలయ సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణ రాజు తెలిపారు. అమలాపురం వాసులు పోతుల దుర్గా ప్రసాదరావు సత్య వెంకట రమణి దంపతులు రూ.20 వేలు, కృష్ణా జిల్లా కంకిపాడు వాసులు విట్టంశెట్టి వెంకట నాగ సత్యనారాయణ వెంకట సునీత దంపతులు రూ.10,116 అందించారని తెలిపారు.

ఎంఎస్‌ఎంఇ సర్వేను వేగవంతం చేయాలి

ప్రజాశక్తి - అల్లవరం

సచివాలయ సిబ్బంది మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్ ప్రైజస్ సర్వే యాప్ ద్వారా త్వరగా ఎంఎస్‌ఎంఇ సర్వేను పూర్తి చేయాలని ఎంపిడిఒ బి.కృష్ణ మోహన్ సిబ్బందిని ఆదేశించారు. ఎంఎస్‌ఎంఇ సర్వే పురోగతిపై సోమవారం ఆయన సచివాలయ సిబ్బందితో కలిసి సమీక్షించారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్స్ శిక్షణ పొందినందున వారు ఇతర సిబ్బందికి అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజ్‌మోహన్, సచివాలయం సిబ్బంది రోజా, అర్జున్, లోవరాజు, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

భీమేశ్వరుని దర్శించుకున్న సిఎంఒ కార్యదర్శి

ప్రజాశక్తి-రామచంద్రపురం



భీమేశ్వరాలయంలో కార్యదర్శి ప్రద్యుమ్న

ముఖ్యమంత్రి కార్యాలయ కార్యదర్శి ప్రద్యుమ్న సోమవారం ద్రాక్షారామ భీమేశ్వర స్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. కుటుంబ సమేతంగా వచ్చిన ఆయనకు ఆలయ అధికారులు స్వాగతం పలికారు. జాయింట్ కలెక్టర్ టి.నిశాంతి, రామచంద్రపురం ఆర్‌డిఒ దేవరకొండ అఖిల ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ఆయన ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.



పోటీల్లో గెలుపొందిన గురుకులం విద్యార్థులు

క్రీడల్లో గురుకులం విద్యార్థుల విజయకేతనం

ప్రజాశక్తి-అల్లవరం

గోడిలోని అంబేద్కర్ బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో విజయకేతనం ఎగురవేశారు. ఏలూరులో గత నెల నిర్వహించిన పోటీల్లో గోడి గురుకులానికి చెందిన సిహెచ్.క్రాంతి కిరణ్ జావలిన్ త్రోలో ద్వితీయ స్థానం, ఎస్.సతీష్ కుమార్ జావలిన్ త్రోలో ద్వితీయ స్థానం, డిస్కస్‌త్రోలో తృతీయ స్థానం సాధించారు. విజేతలను కళాశాల ప్రిన్సిపల్ నక్కా శ్రీనివాస్, పీడీ వి.నానిబాబు, పిఇటి వై.సుబ్రహ్మణ్యం, పేరెంట్స్ కమిటీ చైర్మన్ బి.భరత్ కుమార్, వైస్ చైర్మన్ యాళ్ల నాగలక్ష్మి, సర్పంచ్ తోట శ్రీదేవి, నరసింహ దంపతులు, క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ సత్య బాబు రాజు, ఎంపిటిసి కాంద్రేగుల అచ్యుత సత్యనారాయణ, జిల్లా సమన్వయ అధికారి టి.ఉమాదేవి, జాయింట్ సెక్రెటరీ ఎ.మురళీకృష్ణ అభినందించారు.



సత్యనారాయణను సత్కరిస్తున్న సాహితీవేత్తలు, ప్రముఖులు

కవి సత్యనారాయణకు ఘన సత్కారం

ప్రజాశక్తి-అమలాపురం

విజయవాడలో ఆదివారం నిర్వహించిన శతాధిక కవి సమ్మేళనంలో నిర్వహణ బాధ్యతలతో పాటు, కవితాగానం చేసిన అమలాపురానికి చెందిన ప్రముఖ కవి, రచయిత కవిరత్న డాక్టర్ బివివి సత్యనారాయణను సోమ వారం ఘనంగా సత్కరించారు. డాక్టర్ పొట్లూరి హరికృష్ణ జానపద అకాడమీ సారధ్యంలో విజయవాడ కోర్టు కాంప్లెక్స్‌లోని బుక్ ఫెస్టివల్ సొసైటీలో ఆదివారం రాత్రి వరకూ జరిగిన ఆంధ్ర తెలంగాణ వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కవులందరిచేత కవితాగానం చేయించి, నిర్వహణ బాధ్యతలు చక్కగా అమలు చేసినందుకు కవులు, ఫౌండేషన్ కార్యవర్గం మన్ననలను సత్యనారాయణ చూరగొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సంఘసేవకులు గోర్ల నాగేశ్వరరావు , యాళ్ళ ఉమామహేశ్వరి, నందివాడ చిన్నాదేవి, బోనం గణేష్, రంగిశెట్టి రమేష్, ప్రముఖ కవి నల్లా నరసింహమూర్తి, రుద్రరాజు నానిరాజు, పోలిశెట్టి అనంతలక్ష్మి, పసలపూడి సతీష్, యెండూరి సీతామహాలక్ష్మి, యెండూరి రాఘవ పాల్గొన్నారు.

రెండు రోజుల్లో ఆక్రమణలు తొలగించాలి

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని గోవలంక పంచాయతీ స్థలంలో ఆక్రమణలను రెండు రోజుల్లో తొలగించాలని ఇన్‌ఛార్జ్ ఇఒపిఆర్‌డి నున్న శంకర నారాయణ ఆధ్వర్యంలో అధికారులు బృందం సోమవారం నివాసితులకు స్పష్టం చేశారు. అయితే తాము 50 ఏళ్లుగా ఇదే స్థలంలో నివసిస్తున్నామని, గతంలో ఉన్న పూరిపాకను తొలగించి పక్కా ఇంటిని నిర్మించుకుంటున్నామని, ఆయా నిర్మాణాలను అడ్డుకోవద్దని, దీనికి సంబంధించి కోర్టు ఉత్తర్వులు ఉన్నాయని కొట్నాల దేవానందం, కొట్నాల మధు తెలిపారు. ఈ స్థలాల్లోనే నివాసం ఉండటంతో ప్రభుత్వాలు ఇస్తున్న పేదలకు ఇచ్చే ఉచిత స్థలాలు మాకు ఇవ్వడం లేదన్నారు. ఈ స్థలంలోనే ఇల్లు నిర్మించుకునేలా కలెక్టర్, ఎంఎల్‌ఎ దాట్ల సుబ్బరాజు అనుమతులు ఇవ్వాలని కోరారు. దీనిపై ఇఒపిఆర్‌డి నున్న శంకరనారాయణ, పంచాయతీ కార్యదర్శి శివప్రసాద్ మాట్లాడుతూ గోవలంక పంచాయతీకి చెందిన సర్వేనెంబర్ 52/4 లోని 16 సెంట్లు కామన్ స్థలంలో పలు ఆక్రమణలు జరిగాయని, అయితే ఇటీవల నిర్మాణం ప్రారంభించిన భవనాన్ని తొలగించాలని కలెక్టర్ ఆదేశాలను అమలు చేస్తున్నామని అన్నారు. నిర్మాణదారులు కోరిక మేరకు రెండు రోజుల సమయం ఇచ్చామని అన్నారు.

వర్షంతో రహదారి ధ్వంసం

ప్రజాశక్తి - అంబాజీపేట

గ్రామీణ ప్రాంతాలలో వివిధ శాఖల సమన్వయ లోపంతో ఒక అభివృద్ధి పని చేసేటప్పుడు మరో అభివృద్ధి పని ధ్వంసమై ప్రజాధనం దుర్వినియోగం అవుతోంది. చిరతపూడి ఆర్ అండ్ బి రహదారి నుండి కట్టావారిపాలెం వెళ్లే రోడ్డు 2021లో రూ.65 లక్షల వ్యయంతో 800 మీటర్ల మేర గ్రావెల్ రోడ్డు వేశారు. ఈ రోడ్డు మార్జిన వెంబడి పిఆర్ డబ్ల్యుఎస్ పైపులైన్ నిర్మాణ పనుల్లో భాగంగా రోడ్డు మూసుకుపోయేలా మట్టి వేయడంతో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో రోడ్డు బురదమయం అయ్యింది. వాహనదారులు, స్థానికులు అవస్థలు పడుతున్నారు. అంతేకాక రోడ్డు కూడా ధ్వంసం అవడంతో ఈ రహదారి మీదుగా పుల్లేటికుర్రు, అవిడి, మోడేకుర్రు గ్రామాలకు దగ్గర మార్గం కావడంతో ఆయా ప్రాంతాల వాసులు ఆందోళన



బురదమయంగా మారిన రహదారి

వ్యక్తం చేస్తున్నారు. ఇబ్బందులు తొలగించి ఈ రహదారి అభివృద్ధి పరచాలని స్థానికులు కోరుచున్నారు.

వాకింగ్ ట్రాక్ పునర్నిర్మాణానికి చర్యలు

ప్రజాశక్తి-ముమ్మిడివరం

పట్టణ ప్రజలకు ఉపయుక్తంగా ఉండే విధంగా వాకింగ్ ట్రాక్ పునర్నిర్మాణానికి చర్యలు చేపట్టనున్నట్లు స్థానిక శాసన సభ్యుడు దాట్ల సుబ్బరాజు పేర్కొన్నారు. నగర పంచాయతీ పరిధిలోని స్థానిక పోలమ్మ చెరువు మంచినీటి ట్యాంక్ చుట్టూ ఉన్న వాకింగ్ ట్రాక్‌ను నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్ కుమార్, టిడిపి నాయకులతో కలిసి ఎంఎల్‌ఎ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నగర వాసుల ఆరోగ్య పరిరక్షణకు వాకింగ్ ట్రాక్‌ను పునర్నిర్మాణం చేయడమే కాకుండా, వాకింగ్ ట్రాక్ చుట్టూ దేశ నాయకుల విగ్రహాలను ఏర్పాటు చేసి సుందరమైన ప్రదేశంగా తీర్చిదిద్దాలని ఆయన సూచించారు. అంతే కాక వ్యాయామానికి అవసరమయ్యే జిమ్ సామాగ్రిని వాకింగ్ ట్రాక్ వద్ద ఏర్పాటు చేయాలని కమిషనర్‌ను ఆదేశించారు. ఆయన వెంట టిడిపి నాయకులు గొలకోటి



వాకింగ్ ట్రాక్‌ను పరిశీలిస్తున్న ఎంఎల్‌ఎ సుబ్బరాజు

దొరబాబు, వీళ్ల వీరాస్వామి నాయుడు, చిక్కాల అంజిబాబు, గొల్లపల్లి గోపితో పాటు కమిషనర్ పి.రవి వర్మ, ఎఇ పివి.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

బోడసకుర్రులో దళితుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - అల్లవరం

బోడసకుర్రు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బోడసకుర్రు కమసాల మామిడి సెంటర్‌లో మాలల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు అధ్యక్షులు పండు అశోక్ కుమార్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి ఒక్కరూ ఉన్నతమైన విద్యను అభ్యసించి అంబేద్కర్ ఆలోచన విధానాలను ముందుకు తీసుకెళ్లిన నాడే హక్కులను సాధించుకోగలుగుతామని తెలిపారు. గ్రామ సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి మాట్లాడుతూ మహిళా స్వేచ్ఛ, సమానత్వం హక్కులను సాధించుకోగలుగుతున్నామంటే డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ భారత రాజ్యాంగమే కారణం అన్నారు. ఈ కార్యక్రమంలో మోసుగంటి దుర్గారావు, మాజీ సర్పంచ్



సమ్మేళనంలో మాట్లాడుతున్న అశోక్ కుమార్

సాపే ధర్మరాజు, జల్లి శ్రీనివాసరావు, అంబటి శ్రీను, రొక్కాల నాగేశ్వరరావు, ఎలకతోరి గోపాలం, ముత్తాబత్తుల శ్రీమన్ రాజు, అంబటి లక్ష్మణరావు, నాగవరపు ఈశ్వరరావు, పులిదిండి వెంకన్నబాబు, తిరుకోటి బాలాజీ, నాగాబత్తుల సురేష్, జల్లి రాధాకృష్ణ, విప్పర్తి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు లక్ష్మీప్రసన్న

ప్రజాశక్తి - అంబాజీపేట

కేరళలో జరిగే జాతీయ స్థాయి సెపక్‌తాక్రా పోటీలకు ఇసుకపూడి హైస్కూల్ విద్యార్థిని కన్నేటి పూర్ణ లక్ష్మీ ప్రసన్న ఎంపికైనట్లు హెచ్ఎం ఎఎల్.వరప్రసాద్, పీడీ బూల చిరంజీవి తెలిపారు. జాతీయ పోటీల్లో ప్రతిభ చూపించాలని సర్పంచ్ తరపట్ల మోహన్ సింగ్ బాబూరావు ఆకాంక్షించారు. నంద్యాల జిల్లా నందికొట్కూలో గత నెల 26, 27 తేదీల్లో జరిగిన పోటీలలో సబ్ జూనియర్ విభాగంలో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపికైందన్నారు. విద్యార్థిని ప్రయాణ ఖర్చులకు సర్పంచ్ రెండు వేలు, ఎంపిటిసి ముత్తాబత్తుల ప్రశాంత్ రూ.వెయ్యి, పెద్దిరెడ్డి వెంకటేశ్వరరావు రూ.రెండు వేలు ప్రోత్సాహక నగదు బహుమతి అందజేశారు. పాఠశాల విద్యా కమిటీ చైర్మన్



విద్యార్థిని అభినందిస్తున్న సర్పంచ్, హెచ్ఎం తదితరులు

పళ్ల స్వామి నాయుడు, కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు విద్యార్థిని అభినందించారు.

ముగిసిన పాస్టర్స్ ఐక్య క్రిస్మస్ సభలు

ప్రజాశక్తి - సామర్లకోట

మండల పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గత నాలుగు రోజులుగా జరుగుతున్న 33వ వార్షిక మహాసభలు ఘనంగా ముగిశాయి. అసోసియేషన్ అధ్యక్షులు రెవ డాక్టర్ ఎం.సాల్మన్ రాజు అధ్యక్షతన జరిగిన క్రిస్మస్ వేడుకలో మాత్యూస్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధుల చేతుల మీడిగా క్యాండిల్ సర్వీస్ నిర్వహించి, ప్రత్యేక కేకును కోసి ఐక్య క్రిస్మస్ వేడుకలను ప్రజలతో కలిసి నిర్వహించారు. మండల పాస్టర్స్ అసోసియేషన్ నూతన కార్యావర్గాన్ని ఈ సందర్భంగా ప్రకటించి పరిచయం చేశారు. నూతన అధ్యక్షులుగా రెవ. టి.బ్లెస్సింగ్, కార్యదర్శిగా రెవ. కె.జయబాబు, కోశాధికారిగా రెవ. వై.కరుణకుమార్, ఉపాధ్యక్షులుగా రెవ. పి.తిమోతి, సహాయ కార్యదర్శులుగా రెవ. వి.డేవిడ్‌రాజు, రెవ. పి.విజయబాబు, పాస్టర్ ఎస్ సైలాస్, పాస్టర్ వై.రాము మోసెస్, సహాయ .కోశాధికారిగా రెవ. ఎస్.బెంజిమెన్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అధ్యక్షులు ఆక్టర్ సాల్మన్ రాజు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు వంకా జాన్, రొట్టా లాజరస్, ఎ.చంటి, ఆనంద్ జోసెఫ్, జి.విశ్వేశ్వరరావు, ఎస్.రాజు పాల్గొన్నారు.

నిత్యం ప్రజలతోనే ఉంటాం: ముద్రగడ

ప్రత్తిపాడు : నిత్యం ప్రజలతోనే ఉంటామని వైసిపి నాయకుడు ముద్రగడ పద్మనాభం అన్నారు. సోమవారం మండలంలో రాచపల్లి గ్రామంలో గంగాలమ్మ తల్లిని ఆయన దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిసి సామాజికవర్గంతో తనకు ఎంతో అనుబంధం ఉందన్నారు. ఆ సామాజికవర్గం తన కుటుంబాన్ని ఎల్లప్పుడూ గుర్తు పెట్టుకునే ఉంటుందన్నారు. జగన్ పాలనలో అన్ని సంక్షేమ పథకాలు లబ్ధిదారుని ఇంటికే వచ్చేవని, అందుకు వాలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చారని అన్నారు. కూటమి పార్టీలు అధికారంలోకి వచ్చాక హామీలు అమలు చేయడంల లేదన్నారు.

అధ్వానంగా కపిలేశ్వరపురం రహదారి

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

కపిలేశ్వరపురం ఆర్ అండ్ బి రహదారి గోతులు మయంగా వర్షం నీరుతో అధ్వానంగా మారింది. ఈ రహదారిపై వాహనదారులు, ప్రయాణికులు, నరకయాతన పడుతున్నారు. కపిలేశ్వరపురం నుంచి పలు ప్రాంతాలకు వెళ్లాలంటే ఈ రహదారి మీదుగానే వెళ్లాలి. అధ్వాన స్థితిలో ఉన్న రహదారికి మరమ్మతు పనులు చేపట్టే నాథుడే కరువయ్యారు. వర్షాలు కురిసే సందర్భాల్లో గోతుల్లోకి నీరు చేరడంతో రహదారి కనపడక వాహనదారులు గోతుల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు, రహదారి మీదుగా భారీ వాహనాలు, పాఠశాలకు వెళ్లే విద్యార్థులు, ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే అధికారులు, అనేక అవస్థలు పడుతున్నారు. రాత్రి సమయాల్లో రహదారిపై వెళ్లాలంటే ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు ఆందోళన



గుంతల్లో నీటితో దర్శనమిస్తున్న రహదారి

చెందుతున్నారు. ఈ రహదారి సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా నేటికీ రహదారి సమస్య పరిష్కారం కాలేదని వాపోతున్నారు.

రామచంద్రపురం తహశీల్దార్‌గా సావిత్రి

ప్రజాశక్తి-రామచంద్రపురం

రామచంద్రపురం తహశీల్దారుగా ఎం.సావిత్రి నియమితులయ్యారు. ఆమె రంపచోడవరం సబ్ కలెక్టర్ కార్యాలయం నుండి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ తహశీల్దారుగా పని చేసిన ఎం.వెంకటేశ్వరరావు సఖినేటిపల్లి బదిలీపై వెళ్లారు. ఈ మేరకు కోనసీమ కలెక్టర్ కార్యాలయం నుండి ఉత్తర్వులు వెలువడ్డాయి. విధుల్లో చేరిన సావిత్రి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది ఆమెకు అభినందనలు తెలిపారు.



గుంపులుగా సంచరిస్తున్న వీధి కుక్కలు

కుక్కల స్వైర విహారంతో భయాందోళన

ప్రజాశక్తి-రామచంద్రపురం

పట్టణంలో వీధి కుక్కలు స్వైర విహారం చేయడంతో ప్రజలు భయాందోళన గురవుతున్నారు. ముఖ్యంగా పట్టణంలో 25వ వార్డు 27వ వార్డులో కుక్కల స్వైర విహారం ఇటీవల మరీ అధికమైంది. కుక్కలు గుంపులు గుంపులుగా సంచరిస్తూ పాదచారులపైన, కొత్తగా కనిపించిన వారిపైనా దాడి చేస్తున్నాయి. దీంతో ఈ వార్డులో సంచరించాలంటే ప్రజలకు, విద్యార్థులకు ఇక్కట్లు తప్పడం లేదు. చిన్నారులు స్కూలుకు వెళ్లేందుకు ఈ కుక్కలను తప్పించుకుని వెళ్లేందుకు సాహసమే అవుతోంది. దీనిపై అధికారులు స్పందించి వీధి కుక్కలను అరికట్టాలని ఆయా వార్డు ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

శాయ్ స్పోర్ట్స్ రీజినల్ డైరెక్టర్ పర్యటన

ప్రజాశక్తి - యానాం

స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (శాయ్) రీజనల్ డైరెక్టర్ కిషోర్ సోమవారం యానాంలో పర్యటించారు. స్థానిక జిఎంసి బాలాజీ క్రీడా ప్రాంగణంలో ఉన్న స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా బ్రాంచ్ కార్యాలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రాంతీయ పరిపాలనాధికారి కార్యాలయంలో ఆర్‌ఎఒ మునిస్వామి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మల్లాడి కృష్ణారావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన సాయి స్పోర్ట్స్ యానాంలో రావడానికి గల కారణాలు, ఏర్పాటు చేసిన, చేయాల్సిన సౌకర్యాలు, ప్రభుత్వపరంగా చేసిన సదుపాయాలు తదితర అంశాలపై వివరించారు. అదేవిధంగా యానాంలో మరిన్ని క్రీడా విభాగాలు కేటాయించాలని డైరెక్టర్ కిషోర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సాయి స్పోర్ట్స్ ఇన్‌ఛార్జ్ ఉదయ్ పాల్గొన్నారు.

పోర్టులో అక్రమాలపై విచారణ చేయాలి

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ పోర్ట్‌లో జరుగుతున్న అక్రమాలపై సిబిఐ విచారణ చేయాలని సిపిఐ రాష్ట్ర నాయకుడు టి.మధు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాకినాడ పోర్టుకు ఎంతో చరిత్ర ఉందని, పోర్టును నమ్ముకుని సుమారు 30 వేల కార్మిక కుటుంబాలు జీవిస్తున్నాయని అన్నారు. వైసిపి పాలనలో పిడిస్ బియ్యం ఆఫ్రికా దేశాలకు తరలి వెళ్లాయని, మాజీ ప్రజాప్రతినిధి చేతుల్లో ఇవన్నీ సాగాయని డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలు వాస్తవం అయితే తక్షణమే సిబిఐ విచారణ చేయించాలని ఆయన డిమాండ్ చేశారు. పిడిఎస్ బియ్యం ఎగుమతులను నివారించేందుకు అవసరమైన సిబ్బందిని నియమించి అడ్డుకట్ట వేయాలని అన్నారు. పోర్టు ఎంట్రన్స్‌లో చెక్ పోస్టులు పెట్టడం వల్ల లోడింగ్‌కు అధిక సమయం పడుతుందని, దీంతో కార్మికులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని అన్నారు.

పలువురికి జ్యోతుల నవీన్ పరామర్శ

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని యర్రంపాలెం గ్రామంలో పలు కుటుంబాలను టిడిపి జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్ సోమవారం పరామర్శించారు. తొలుత కిడ్నీలో రాళ్లకు సంబంధించి ఆపరేషన్ చేయించుకున్న ఉపసర్పంచ్ ముత్యాల దుర్గారావును పరామర్శించారు. అలాగే మాతృవియోగంతో బాధపడుతున్న మాజీ సర్పంచ్ ముత్యాల వీరభద్రరావును, గున్నం శ్రీనివాస్ మృతితో బాధపడుతున్న ఆయన కుటుంబాన్ని, మాతృవియోగంతో బాధపడుతున్న పంచాయతీ వార్డు సభ్యులు ముత్యాల వీర వెంకట సత్యనారాయణను, మృతి చెందిన చింతపల్లి బాబురావు కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఈ పర్యటనలో మండల టిడిపి అధ్యక్షులు పోతుల మోహనరావు, నియోజవర్గం తెలుగు యువత అధ్యక్షులు దేవరపల్లి మూర్తి, ముత్యాల భాస్కరరావు, ముత్యాల వీరభద్రరావు, బిక్కిన వెంకట్రావు, పెదపాటి శుభకార్, ముత్యాల సతీష్, ముత్యాల భద్రరావు పాల్గొన్నారు.

పేరెంట్స్ డేను ఘనంగా నిర్వహించాలి

ప్రజాశక్తి - సామర్లకోట

ఈ నెల 7వ తేదీన నిర్వహిస్తున్న మెగా పేరెంట్స్ డేను పండగ వాతావరణంలో నిర్వహించాలని ఎంఇఒ-1 వై.శివరామకృష్ణయ్య తెలిపారు. సోమవారం ఆయన స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌ను సందర్శించి పేరెంట్స్ డే ఏర్పాట్లను హెచ్ఎం తోటకూర సాయిరామకృష్ణ, ఎస్ఎంసి చైర్మన్ అక్కిన చక్రధర్ సమీక్షించారు. హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులు పేరెంట్స్‌కు అంద చేయడానికి సిద్ధం చేసినట్లు హెచ్ఎం తోటకూర సాయి రామకృష్ణ వివరించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని స్వయంగా వడ్డించి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి స్కూల్‌లోను పేరెంట్స్ అందరూ హాజరయ్యేలా దృష్టి సారించాలన్నారు. డిసెంబర్ 4న 3, 6, 9 తరగతులకి నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (నాస్)పరీక్షను ఎంపిక చేసిన ఆరు స్కూల్స్‌లో పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసి సభ్యులు పి.సతీష్, ఎం.దేవి, లక్ష్మి, టి.రాఘవ, కె.అరుణ పాల్గొన్నారు.